‘జగనన్న ఆరోగ్య సురక్ష’ సూపర్ సక్సెస్

- ఆదోని నియోజకవర్గంలో 42 సురక్ష వైద్య శిబిరాలు
- వేలాది మందికి ఆరోగ్య పరీక్షలు, మందుల పంపిణీ
- వైద్య శిబిరాల ఏర్పాటుపై సర్వత్రా హర్షం



శంకర్‌నగర్‌లో నిర్వహించిన వైద్య శిబిరంలో పేర్లను నమోదు చేసుకుంటున్న మహిళలు (ఫైల్),



భీరప్పగేరిలో మందుల పంపిణీని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ బోయ శాంత

ఆదోనిటౌన్: నియోజకవర్గంలో గత నెల 2వ తేదీ నుంచి ఈనెల 1వ తేదీ వరకు ప్రభుత్వం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు అనూహ్య స్పందన లభించింది. వృద్ధులు, మహిళలు, గర్భిణులు, బాలింతలు, రక్తహీనతతో బాధపడే పిల్లలు, మహిళలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. స్పెషలిస్ట్ వైద్యులు బీపీ, షుగర్, ఈసీజీ, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 42 వైద్య శిబిరాలను నిర్వహించారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన వైద్య శిబిరాలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వేలాది రూపాయలు విలువ చేసే ఆరోగ్య పరీక్షలు, మందులు ఉచితంగా ఇవ్వడం, ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం గొప్ప విషయమని పేర్కొంటున్నారు. ఇలాంటి సీఎంను ఎప్పుడూ చూడలేదని, ఏ రాష్ట్రంలో లేనివిధంగా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో జగనన్నకు మరొకరు సాటిలేరని చర్చించుకుంటున్నారు.

నియోజకవర్గంలో 42 వైద్యశిబిరాలు

- ఆదోని నియోజకవర్గంలో అర్బన్‌లో 21, రూరల్‌లో 21 ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించారు.
- రూరల్‌లో 82,743 మంది, పట్టణంలో 1,13,034 మంది జనాభా ఉన్నారు.
- మండలంలోని 21 వైద్య శిబిరాల్లో 7,591 మంది ఓపీ ద్వారా పేర్లను నమోదు చేసుకుని వైద్యం చేయించుకున్నారు.
- అర్బన్‌లో 15,567 మంది వైద్య సేవలు పొందారు.
- రూరల్‌లో 173, అర్బన్‌లో 102 మందిని మెరుగైన వైద్య కోసం ఆరోగ్య శ్రీ ఆస్పత్రులకు రెఫర్ చేశారు.
- రూరల్‌లో 6,829, అర్బన్‌లో 10,818 మంది బాలికలకు రక్త పరీక్షలు చేశారు.
- రక్తహీనతతో బాధపడుతున్న బాలికలు రూరల్‌లో 1,842, అర్బన్‌లో 400 మంది ఉన్నట్లు గుర్తించారు.
- రక్తం తక్కువగా (మధ్య రకం) ఉన్న వారు రూరల్‌లో 2,558, అర్బన్‌లో 4,143 మంది ఉన్నారు.
- రూరల్‌లో 406, అర్బన్‌లో 688 మంది కొత్తగా బీపీ సమస్యలతో బాధపడుతున్నారు.
- రూరల్‌లో 142 మంది, అర్బన్‌లో 250 మందికి కొత్తగా షుగర్ వ్యాధిగ్రస్తులున్నట్లు గుర్తించారు.
- రూరల్‌లో 1,263, అర్బన్‌లో 1,570 మంది కంటి పరీక్షలు చేయించుకోగా కంటిపొర సమస్య ఉన్న వారు రూరల్‌లో 308, అర్బన్‌లో 400 మంది ఉన్నట్లు తెలిసింది.
- కుష్టువ్యాధిగ్రస్తులు రూరల్‌లో 19 మంది, అర్బన్‌లో 185 మంది ఉన్నారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన



నెలరోజులపాటు ఆదోని నియోజకవర్గంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. వృద్ధులు, మహిళలు రక్తహీనతతో బాధపడే పిల్లలకు పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. వ్యాధి తీవ్రత ఉన్న వారికి, కంటి ఆపరేషన్ల కోసం ఏరియా, కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేయడం జరిగింది.

– డాక్టర్ సత్యవతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

- రూరల్‌లో గళ్ల పరీక్షలు 473, అర్బన్‌లో 1107 మందికి చేశారు.

బీపీ, షుగర్‌కు మందులిచ్చారు



నేను బీపీ, షుగర్‌తో బాధపడుతున్నాను. సురక్ష వైద్య శిబిరంలో పెద్ద డాక్టర్లు పరీక్షలు చేశారు. కళ్లు తిరగడం, నీరసంగా ఉండడం వంటి పరీక్షలు కూడా చేయించుకున్నా. ఆలస్యం లేకుండా ఆరోగ్య పరీక్షలు చేసి 20 రోజులకు సరిపడా మందులు ఇచ్చారు. ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలంటే ఒక రోజంతా సమయం పట్టేది. అలాంటిది భీరప్ప గుడిలో నిర్వహించిన వైద్య శిబిరంలో అరగంటలోపే అన్నీ పూర్తయ్యాయి.

– లలితమ్మ, మేదర్‌గేరి, ఆదోని పట్టణం

పెద్ద డాక్టర్లు పరీక్షలు చేశారు



పేద ప్రజల కోసమే ప్రభుత్వం ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తోంది. ఇంట్లో మంచంపై నుంచి లేవలేని వారికి ఇంటి వద్దకే వచ్చి పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. నేను రక్తం, కంటి, బీపీ పరీక్షలు చేయించుకున్నా. పెద్ద డాక్టర్లు ఆరోగ్య పరీక్షలు చేశారు. పేదలకు ఉపయోగకరంగా ఉంది. జగనన్న నిత్యం పేదల విద్య, వైద్యంపైనే ఆలోచిస్తున్నారు. శిబిరాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పరీక్షలు చేయించుకుంటున్నారు.

– మారెన్న, తాయమ్మగుడి ఏరియా, ఆదోని పట్టణం

- టీబీ పాజిటివ్ కేసులు.... రూరల్‌లో 2, అర్బన్‌లో 161 కేసులు ఉన్నట్లు గుర్తించారు.

జగనన్నతోనే అన్ని వర్గాల అభ్యున్నతి



హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సోపానాలు కావాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ‘ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు సీఎం కావాలి’ అంశంపై రాంపురం గ్రామంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. మంత్రాలయం మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, బూత్ కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 90 శాతానికి పైగా నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే చెల్లిందన్నారు. నవరత్నాల పథకాలతో లక్షలాది మంది లబ్ధిపొందారని పేర్కొన్నారు. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, జగనన్న చేయూత, జగనన్న చేదోడు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్, పంటలకు గిట్టుబాటు ధరలు తదితర పథకాలతో పేదలకు లబ్ధి చేకూరిందని వివరించారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న జగనన్న సీఎంగా కొనసాగడం రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. ఈ విషయం ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. 2024 ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని సూచించారు. ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేయాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేయాలన్నారు. అలాగే మంత్రాలయం నియోజకవర్గంలో రూ.74.17 కోట్లతో 6 ఎత్తిపోతల పథకాల నిర్మాణం చేపట్టామన్నారు. మంత్రాలయంలో రూ.3 కోట్లతో జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ప్రతి పల్లెలో ప్రభుత్వం చేసిన ప్రగతి పనులు, ప్రజలకు చేసిన మేలును వివరించాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి, కల్లుదేవకుంట సింగిల్ విండో ప్రెసిడెంట్ రఘునాథ్ రెడ్డి, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య, నాయకులు లక్ష్మయ్య, రోగప్ప, శ్రీనివాసులు, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యలతో కార్పొరేట్ ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్సలు చేయించుకున్న బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను శుక్రవారం రాంపురం గ్రామంలో వారికి పంపిణీ చేశారు. కోసిగి మండలంలోని దొడ్డి బెళగల్‌కు చెందిన బి.చంద్రశేఖర్‌రెడ్డి బెంగళూరులో గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. ఆయనకు మంజూరైన రూ.2 లక్షలు, మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామానికి చెందిన రాఘవేంద్రశెట్టి కాలికి ఆపరేషన్ చేయించుకోగా మంజూరైన రూ.80 వేల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పథకం పరిధిలోని చికిత్సలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం చేస్తున్నారని వివరించారు. పేదలకు ఈ సదుపాయం ఎంతో ఉపయుక్తంగా ఉందని పేర్కొన్నారు. పార్టీ మండల కన్వీనర్ భీమారెడ్డి, నాయకులు రోగప్ప, మల్లికార్జునగౌడ్ తదితరులు ఉన్నారు.

జాబ్‌మేళాలో 188 మందికి ఉద్యోగాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిరూరల్: ప్రభుత్వం నిరుద్యోగుల కోసం ఏర్పాటు చేసిన జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకుని, అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాబ్‌మేళాను నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాలో సీటెక్, రేడియంట్, సెల్కాన్ ఎలక్ట్రికల్స్, శ్రీరామ్ చిట్స్ అండ్ లైఫ్ ఇన్సూరెన్స్, ఎస్కేబయో ఎంటర్‌ప్రైజెస్, ఫ్యూజన్ మైక్రోఫైనాన్స్, నవభారత్ ఫర్టిలైజర్స్, ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, అమర్‌రాజా గ్రూపు, ఫ్లిప్‌కార్ట్, సీఎంఆర్‌ఈఓ అల్యూమినియం ప్రైవేట్ లిమిటెడ్, ఆటో సైన్స్, మితుబాషా ఆస్టోస్టీల్స్, వివిధ కంపెనీల ప్రతినిధులు ఉద్యోగాల భర్తీ కోసం అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. దాదాపు 601 మంది యువత ఇంటర్వ్యూలకు హాజరుకాగా వీరిలో 188 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. నిరుద్యోగులు ప్రతిభను చూపి ఉద్యోగాలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బి.శాంత, మార్కెట్‌యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్, వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కరెస్పాండెంట్ సీఏబీ దైవాదీనం రెడ్డి, ప్రిన్సిపాల్ మురళీమోహన్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంతరెడ్డి, నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామర్థ్య పరీక్షలు



ఆదోనిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను తెలుసుకునేందుకు నిర్వహించిన ఎన్‌సీఈఆర్‌టీ నాస్ సర్వే పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షలు పట్టణంలోని అన్ని ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలల్లో నిర్వహించారు. 3, 6, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఎన్‌సీఆర్‌టీ ఎంపిక చేసిన పురపాలక నెహ్రూ మెమోరియల్, ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పురపాలక, ప్రభుత్వ బాలికల పాఠశాల, ఇతర పాఠశాలల్లో ఓఎంఆర్ షీటు విధానంలోనే పరీక్షలు రాశారు. ఇంజినీరింగ్, డిగ్రీ చదివిన విద్యార్థుల పర్యవేక్షణలో పరీక్షలు జరగాయి. మండల విద్యాధికారులు బి.శివరాములు, శ్రీనివాసులుతో పాటు అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పరీక్షల నిర్వహణను పరిశీలించారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షలపై విద్యార్థులకు అవగాహనతో పాటు అభ్యాసన సామర్థ్యాలు మెరుగుపడుతాయని పలువురు పేర్కొన్నారు.



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న ఎంఈఓ శోభరాణి

నాణ్యమైన విద్య కోసమే ఎన్ఏఎస్ పరీక్ష

కౌతాళం: విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి నాణ్యమైన విద్య అందించేందుకే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి–2 శోభరాణి తెలిపారు. శుక్రవారం 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఎన్ఏఎస్ పరీక్షలు నిర్వహించారు. ఇన్విజిలేటర్లుగా డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో పాటు కొంతమంది ప్రధానోపాధ్యాయుల్ని నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాసన స్థాయి ఎలా ఉందో తెలుసుకోవడానికి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో పాటు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు కూడా పరీక్షలు నిర్వహించామన్నారు. మండలంలో మొత్తం మొదటి విడతగా 29 పాఠశాలల్లో 460 మంది విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ పరీక్షల ద్వారా నాణ్యమైన విద్యను అందించేందుకు దోహద పడుతుందన్నారు.

వేధింపులపై చర్యలు తీసుకోవాలి



సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు

ఆదోనిరూరల్: ఆదోని డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యుడు ఏ.రవిపై డిపో మేనేజర్, ఎస్‌టీఐ వేధింపులకు గురిచేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు, నంద్యాల ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రెండు జిల్లాల ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు మాధవరం బాలసుందరం మాట్లాడుతూ.. కండక్టర్ ఏ.రవిని వేధింపులకు గురి చేసి ఆదోని డిపో నుంచి పత్తికొండ డిపోకు బదిలీ చేయడం దారుణమన్నారు. దీనిపై విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజ్యలక్ష్మి, శీలయ్య, పీవీ కుమార్ తదితరులు ఉన్నారు.

రేపు మంగరాయుడికి వెన్నతో అలంకారం

ఆదోనిఅర్బన్: పట్టణశివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన మంగరాయుడికి ఆదివారం పుష్యార్కయోగం సందర్భంగా నవనీత (వెన్నతో) అలంకారం చేస్తున్నట్లు ఆలయ మేనేజర్ వాసుదేవరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పుష్యార్కయోగం సందర్భంగా మంత్రాలయం మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థ శ్రీపాదుల ఆదేశాల మేరకు స్వామివారికి విశేష మధు అభిషేకం, ఫల పంచామృతాభిషేకం నిర్వహించి అనంతరం నవనీత (వెన్న) అలంకారం చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనదలిచిన వారు 99857 06489 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆయకట్టుకు సాగునీరు అందించండి



ఏఈ రాజేష్‌తో చర్చిస్తున్న వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు పి.మురళీమోహన్ రెడ్డి

కోసిగి: ఎల్లెల్సీ కింద సాగు చేసిన ఆయకట్టు పొలాలు ఎండిపోకుండా సాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు పి.మురళీమోహన్ రెడ్డి కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఎల్లెల్సీ కార్యాలయంలో ఏఈ రాజేష్‌ను మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సాగునీటి తీరువాపై చర్చించారు. కామవరం హెడ్ రెగ్యులేటర్ నుంచి ఎల్లెల్సీ సాగునీరు కోసిగి మండలానికి 60 వేల క్యూసెక్కుల వాటా రావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం 35 వేల క్యూసెక్కుల నీటి వాటా వస్తోందని ఏఈ వివరించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పూర్తిగా ఆయకట్టుదారులకు న్యాయం చేయలేకపోతున్నామన్నారు. గత నాలుగేళ్లుగా పుష్కలంగా ఏప్రిల్ వరకు కాలువ ద్వారా నీటిని అందించామని ఈ ఏడాది కష్టంగా ఉందన్నారు. మాధవరం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, గురురాఘవేంద్ర ప్రాజెక్ట్‌లలో భాగంగా దుద్ది, మూగలదొడ్డి రిజర్వాయర్‌లను నీటితో నింపాలని సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రిజర్వాయర్ల నుంచి సాగునీటిని అందించేందుకు కృషి చేయాలన్నారు. ఎంపీపీ ఈరన్న, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, ఎన్.నాగరాజు, బసిరెడ్డి, లస్కర్లు, రైతులు ఉన్నారు.

ఓటరు జాబితా పక్కాగా రూపొందించండి



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి రమ

మంత్రాలయం: సకాలంలో ఓటరు జాబితా రూపకల్పన పూర్తి చేయాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి రమ ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితా రూపకల్పనపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తప్పులకు తావు లేకుండా జాబితాను రూపొందించాలని సూచించారు. ఓటర్ల నమోదు, తొలగింపు, డూప్లికేట్ ఓటర్ల గుర్తింపు పక్కాగా చేపట్టాలన్నారు. నిర్ణీత సమయంలో ఓటర్ల జాబితా ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. సమీక్షలో తహసీల్దార్లు చంద్రశేఖర్, రుద్రగౌడ్, ఎలక్షన్ డీటీ శశిశేఖర్, బూత్ లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమను సాధించుకుందాం



పోస్టర్లను విడుదల చేస్తున్న వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు

ఆదోని సెంట్రల్: కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కొరకు విద్యార్థులు, యువత ఉద్యమాలకు సిద్ధం కావాలని వామపక్ష విద్యార్థి సంఘు నాయకులు షాబీర్, భరత్‌కుమార్, సోమశేఖర్ తదితరులు పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల అవరణలో.. ఈ నెల 8వ తేదీన చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ విభజన హామీల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వమే నిధులు వెచ్చించి ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరారు. పరిశ్రమ ఏర్పాటయితే ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అలాగే ఎంతో చరిత్ర కలిగిన వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తామని చెప్పడం తగదన్నారు. ఛత్తీస్‌ఘడ్‌లో స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని, ఇక్కడేమో ప్రైవేటీకరణ చేస్తామని చెప్పడంలో అర్థమేమిటని ప్రశ్నించారు. ప్రతిఒక్కరూ స్పందించి ఆ పరిశ్రమలను కాపాడుకోవడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వామపక్ష విద్యార్థి సంఘ నాయకులు మల్లికార్జున, వీరేంద్ర, రవి, కిశోర్, ప్రవీణ్, సాయి, నాగేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌పై కేసు

ఆదోనిఅర్బన్: హిందూ మనోభావాలను దెబ్బతీసేలా సమావేశంలో మాట్లాడిన మాజీ కౌన్సిలర్ ఇబ్రహీంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్ తెలిపారు. శుక్రవారం రాత్రి మాజీ కౌన్సిలర్ ఓ సమావేశంలో హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడడంపై హిందూ ధార్మిక సంఘాల నాయకులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇబ్రహీంపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రైతు భరోసా అర్హుల జాబితా విడుదల



జాబితాలో పేర్లను పరిశీలించుకుంటున్న నదిచాగి రైతన్నలు

కౌతాళం: ఈ ఏడాది వైఎస్సార్ రైతు భరోసా రెండవ విడత అర్హుల జాబితాను అధికారులు విడుదల చేశారు. ఈ మేరకు మండల పరిధిలోని నదిచాగి గ్రామంలో వ్యవసాయ కార్యాలయం నోటీసు బోర్డుపై శుక్రవారం జాబితాను ప్రదర్శించారు. దీంతో రైతులు తమ పేర్లను పరిశీలించుకుంటున్నారు. మండలంలో ఇప్పటికే మొదటి విడతలో రైతుల ఖాతాలో ప్రభుత్వం రూ.5,500 జమ చేయడం జరిగిందని, త్వరలోనే రెండవ విడత నిధులు జమచేయనున్నట్లు గ్రామ వ్యవసాయాధికారి వెంకటేష్ తెలిపారు. నదిచాగి తో పాటు మజారా గ్రామం మేళిగనూరుకు చెందిన అర్హుల జాబితా ప్రదర్శించినట్లు చెప్పారు. ఈనెల 7వ తేదీన పట్టాదారు రైతులకు రూ.2 వేల చొప్పున కౌలు రైతులకు రూ.4 వేలు చొప్పున రైతు భరోసా పథకం నిధులు జమ అవుతాయని ఆయన తెలిపారు.

శరవేగంగా అంగన్‌వాడీ భవనాల నిర్మాణం



జంపాపురంలో అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఏఈ రంగరాజు

కోసిగి: మండలంలో నాడు–నేడు కింద అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. శుక్రవారం జంపాపురంలో జరుగుతున్న నిర్మాణ పనులను ఏఈ రంగరాజు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కోసిగి మండలంలో నాడు–నేడు కింద జంపాపురం, ఆర్లబండ, వందగల్లు, దుద్ది, దొడ్డి, నేలకోసిగి, గౌడుగల్లు గ్రామాలకు అంగన్‌వాడీ భవనాలు మంజూరయ్యాయన్నారు. ఒక్కో భవన నిర్మాణం కోసం రూ.16 లక్షలు చొప్పున నిధులు కేటాయించినట్లు చెప్పారు. భవన నిర్మాణంతో పాటు ఆట వస్తువులు, మౌళిక వసతులు కల్పించాల్సి ఉందని తెలిపారు. ఇప్పటివరకు 5 అంగన్‌వాడీ భవనాలు రూఫ్ లెవెల్ పూర్తి కాగా, మరో రెండు లెంటల్ లెవెల్‌లో ఉన్నాయన్నారు. వేగంగా పనులు చేయించి అంగన్‌వాడీ కార్యకర్తలకు అప్పగిస్తామన్నారు.

పాలస్తీనాపై యుద్ధం ఆపండి

కౌతాళం: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం ఆపాలని, శాంతి ఏర్పాటుకు ప్రపంచ దేశాలన్ని కృషి చేయాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుభాన్ కోరారు. ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కౌతాళంలో ముస్లింలు భారీ శాంతి ర్యాలీ చేపట్టారు.

క్లుప్తంగా

నూతన ఓటర్ల జాబితా పరిశీలన



దండుగేరిలో ఓటరు జాబితాపై విచారణ చేస్తున్న వార్డు ఇన్‌చార్జ్ సాకరే గోవిందరావు

ఆదోనిటౌన్: పట్టణంలోని 4వ వార్డు బూత్ నంబర్ 146 ఏరియాలో 2024 నూతన ఓటర్ల జాబితాపై వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ సాకరే గోవిందరావు శుక్రవారం విచారణ చేపట్టారు. ఓటర్ జాబితాతో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ల వివరాలను, వారి పూర్తి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి అవకతవకలు లేకుండా పగడ్బందీగా నిర్వహించడం జరుగుతుందని గోవిందరావు తెలిపారు.

ఎస్ఎస్ ట్యాంకు పరిశీలన



ఎస్ఎస్ ట్యాంకులో నీటి నిల్వను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోనిటౌన్: ఆదోని పట్టణానికి తాగునీటిని అందించే బసాపురం ఎస్ఎస్ ట్యాంకులోకి జరుగుతున్న రా వాటర్ పంపింగ్, నీటి నిల్వ, మరమ్మతు పనులను మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఏఈ రాజశేఖర్‌రెడ్డి, అధికారులు పరిశీలించారు. శుక్రవారం కమిషనర్ ఎస్ఎస్ ట్యాంకు వద్దకు చేరుకున్నారు. ప్రస్తుతం తుంగభద్ర దిగువ కాలువ నుంచి రా వాటర్ పంపింగ్ వేగంగా సాగుతుందని, చెరువులో నీటిమట్టం 50 శాతానికి పైగానే చేరిందన్నారు. వేసవికాలంలో ఆదోనికి ఎలాంటి నీటి కొరత ఉండదన్నారు. కెనాల్ బంద్ అయ్యేలోగానే చెరువును పూర్తిస్థాయిలో నింపుతామని చెప్పారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో పాల్గొన్న ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: పెండింగ్‌లో ఉన్న పురపాలక ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్‌టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర పురపాలక కమిటీ సభ్యులు రమేష్‌నాయుడు, వీరచంద్ర యాదవ్ రాష్ట్ర నాయకులు లోక్యనాయక్ కోరారు. శుక్రవారం ఎస్‌టీయూ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు రవి అధ్యక్షతన సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా, ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా, ప్రధానోపాధ్యాయులకు, విద్యాధికారి, డిప్యూటీ టీఈఓలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. బదిలీలతో పాటు జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఎస్టీయూ నాయకులు ప్రహ్లాద్, ఉరుకుందప్ప, రాజా, సతీష్, కలీల్, జుబేర్, జంబులయ్య, గురురాజా, భీమరాజు, గంగనాయక్, భాస్కర్ అచారి, మనోహర్ పాల్గొన్నారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల మంజూరు

కౌతాళం: మండల పరిధిలోని పొదలకుంట గ్రామంలో ప్రధాన మంత్రి ఉజ్వల పథకం కింద అర్హులైన వారికి వంటగ్యాస్ కనెక్షన్లను మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో గ్రామ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జులు మల్లయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పేదల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన వారికి ఉచితంగా గ్యాస్ స్టవ్‌లను పంపిణీ చేశారు. గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ బుడదొడ్డి, నాయకులు ఉచ్చప్ప, బుడ్డెకల్లు గణేష్ పాల్గొన్నారు.

ఎంఈఓలకు విధివిధానాలపై హర్షం

కోసిగి: రాష్ట్ర ప్రభుత్వం ఎంఈఓ–1, ఎంఈఓ–2లకు విధివిధానాలను స్పష్టంగా కేటాయిస్తూ జాబ్‌చార్ట్‌ను విడుదల చేయడంపై మండల విద్యాధికారులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కోసిగి ఎంఈఓ–2గా వచ్చిన నాగేశప్పను నాడు–నేడు ఏఈ రంగరాజు, సీఆర్‌పీలు ఉసేని, అనంతరాం, యోహాన్, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ వీరారెడ్డి, డీటీపీ నరేంద్ర, అటెండర్ వీరస్వామి తదితరులు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. ఎంఈఓలకు విద్యాసంబంధ విధులు, అడ్మినిస్ట్రేటివ్ విధులు, పథకాల అమలు తీరును పకడ్బందీగా కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు.

విద్యుత్ బకాయిలు వసూలు చేయండి

ఆదోనిఅర్బన్: డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ ఉమాపతి ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక డీఈ కార్యాలయంలో మంత్లీ రివ్యూ మీటింగ్ జరిగింది. మీటింగ్‌లో డివిజన్ పరిధిలో ఉన్న ఏఈఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు వెంటనే కనెక్షన్లు ఇవ్వాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ వినియోగదారుల సమస్యలను పరిష్కరించాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.